నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | MAHABUBABAD




రావిరాలలో కూలిన ఇల్లు, (ఇన్‌సెట్‌లో) తడిసిన బియ్యం

# కూడు లేదు.. గూడు లేదు

**కట్టుబట్టలు తప్ప ఇంకేం దక్కలే**

## తిందామంటే తిండిలేదు... ఉందామంటే ఇల్లు లేదు

- అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని అరిగోస పడ్డ రావిరాల
- నిండా ముంచిన వరద బీభత్సం
- కొట్టుకుపోయిన మూగజీవులు, వాహనాలు
- ఇదీ రావిరాల ప్రజల గోస



రావిరాలలో బురదతో నిండిన తన ఇంటిని శుభ్రం చేస్తున్న మహిళ

**అర్ధరాత్రి వేళ పెను తుఫాను వలె దూసుకొచ్చి ఊళ్లన్నంటినీ ఊడ్చేసింది. జల విలయం ధాటికి ఇళ్లు, పంట పొలాలనూ తుడిచిపెట్టేసింది. ఇక వాహనాలు, పశువులను, బట్టలు, వంట పాత్రలు, నిత్యావసరాలు, ఇతర సామగ్రినంతా వరద పాలు చేసి కట్టుబట్టలనే మిగిల్చింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం మానుకోట జిల్లాల్లో సృష్టించిన బీభత్సానికి అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని అరిగోస పడ్డ ప్రజల బాధ వర్ణనాతీతం. తినడానికి తిండి లేక ఉండేందుకు ఇల్లు లేక కట్టుబట్టలే తప్ప ఇంకేమీ మిగలకపోవడంతో నెల్లికుదురు మండలం రావిరాల ప్రజలకు కన్నీళ్లే దిక్కయ్యాయి. వాన నిండాముంచినా సర్కారు పట్టించుకోలేదని.. నాయకులు వచ్చి మాటలు చెప్పారు తప్ప.. చేతల్లో చూపలేకపోవడంతో సాయం కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.** *- నెల్లికుదురు, సెప్టెంబర్ 2*

మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలతో రాజులకొత్తపల్లి చెరువు తెగి నెల్లికుదురు మండలంలోని రావిరాల గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. ఇలా వరద సృష్టించిన బీభత్సంతో గ్రామంలో ప్రతి ఇంట్లోకి నడుము లోతు నీళ్లు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫలితంగా గ్రామంలో ఐదు ఇండ్లు నేలమట్టమయ్యాయి. 25 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇండ్లు కూలి ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా నీటిపాలయ్యాయి. 72 ఇళ్లలోకి నీరు చేసి బియ్యం బస్తాలు, పంటల సాగు కోసం తెచ్చి పెట్టుకున్న ఎరువుల బస్తాలు తడిసి ముద్దయ్యాయి. అంతేగాక 92 గొర్రెలు, ఆటో, 2 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ వరద నీటిలో కొట్టుకపోయాయి. ప్రస్తుతం ట్యాంకర్‌తో ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తక్షణ సహాయం కింద 72 కుటుంబాలకు ఇంటికి 10 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు.

### నా గొర్లన్నీ కొట్టుకుపోయినయ్



నాకున్న 80 గొర్లను సాదుకుంట బతుకుతున్న. వరద వచ్చి ఇల్లు మొత్తం ఆగమైంది. మా నాన్న చనిపోయి నెల రోజులు మాత్రమే అయింది. మాసికం ఖర్చుల కోసం తెచ్చి ఇంట్లో దాచుకున్న రూ.60 వేల కొట్టుకపోయినయ్. నా జీవనాధారమైన 40 గొర్లు వరద ప్రవాహంలో పోయినయ్. నేను, నా పిల్లలు జీవనాధారం కోల్పోయాం. ఇప్పుడు నేనేం చేయాలె. ఎట్ల బతుకాలే.

**– కడారి వీరయ్య, బాధితుడు, రావిరాల**



### నేను బతుకుతా అనుకోలేదు..

ఒక్కసారిగా వాన వచ్చి ఇంటిని ముంచింది. వరదలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నీళ్లలో మునిగిపోయాయి. మాది చాలా పేద కుటుంబం. నీడ కోసం ఏదో చిన్నగా కట్టుకుని ఉంటున్న. మాయదారి వాన వచ్చి మమ్ముల ఆగం చేసింది. ఆ రోజు రాత్రి ప్రాణాలు పైపైనే పోతాయనుకున్నా. తెల్లారేసరికి ఇగ నేను బతికకంటనో లేదో అనుకున్నా. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికున్న. ఇప్పుడు తిందామంటే తిండిలేదు.. ఉందామంటే ఇల్లు లేదు.

**– సురుగురి ఎల్లమ్మ, బాధితురాలు, రావిరాల**



### ఇల్లంతా కూలిపోయింది..

నాకు ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. అందరి పెళ్లిళ్లు అయి వేర్వేరుగా ఉంటాన్రు. నా కొడుకు హైదరాబాద్‌లో ఉంటాండు. నాకు మోకాళ్ల నొప్పులుంటే నా కొడుకు పట్నంల ఆపరేషన్ చేయించిండు. మొన్ననే పట్నం నుంచి ఇక్కడికి వచ్చిన. మొన్న రాత్రి ఒక్కసారిగా ఇంట్లకు నీళ్లచ్చినయ్. పక్కింటోళ్లు వచ్చి నన్ను తొందరతొందరగా ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చిళ్లు. కొంచెం సేపటికి నా ఇల్లు మొత్తం కూలిపోయింది. ఇంట్లో ఉన్న అన్ని వస్తువులు పూర్తిగా కరాబయ్యాయి. ఉండేటందుకు ఇల్లు లేదు. ఎవ్వలు బుక్కెడు బువ్వ పెడుతే అక్కడే తింటున్నా, అక్కడే పడుకుంటాన.

**– చిప్ప నర్సమ్మ, బాధితురాలు, రావిరాల**




మరిపెడ మండలం సీతారాంతండాలో తడిసిన సామగ్రిని తీస్తున్న మహిళ, తడిసిన బియ్యాన్ని చూపుతున్న వృద్ధుడు

### నేడు మానుకోటకు సీఎం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 2 : అతి భారీవర్షాలతో అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లా నుంచి రోడ్డు మార్గంలో మానుకోటకు చేరుకోనున్నారు. డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి సమీపంలోని సీతారాంతండాను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడనున్నారు. భారీ వర్షానికి కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించనున్నారు.



బయ్యారం : ఆదుకోవాలంటూ సీతక్కకు చేతులెత్తి మొక్కుతున్న రైతు మల్లేశ్



కేసముద్రం : సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న వారికి పక్కకు నెట్టివేస్తున్న పోలీసులు

# నిరసన.. నిలదీత

## కేసముద్రంలో మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకున్న తండావాసులు

*అల్లిగూడెంలో 'దండం పెడతా.. ఆదుకోండి' అంటూ రైతు వేడుకోలు*

- వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటన
- ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ

కేసముద్రం/ఇనుగుర్తి/నెల్లికుదురు/మహబూబాబాద్ రూరల్/గంగారం/బయ్యారం, సెప్టెంబర్ 2 : రెండు రోజులుగా కురిసిన వర్షానికి వరద బారిన పడిన మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమెకు పలు చోట్ల నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి.కేసముద్రం మండల కేంద్రంలోని కట్ట తండా తమ ప్రాంతానికి రావాలని, సమస్యలను పరిశీలించాలని కోరారు. అయినప్పటికీ మంత్రి వెళ్లిపోతుండడంతో భూక్యా నీలమ్మ, ఆంగోత్ ప్రసన్ననాయక్, భూక్యా అమ్మి, ధరావత్ తార, శోభ మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రహదారి పైకి వచ్చి మంత్రి కాన్వాయికి అడ్డుతగిలారు. పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి వారిని బలవంతంగా పక్కకు నెట్టివేయడంతో కాన్వాయి వెళ్లిపోయింది. ఈ సందర్భంగా కట్టతండా వాసులు మాట్లాడుతూ భారీ వర్షాలతో వరద తమ ఇండ్లలోకి వచ్చి బియ్యం, నిత్యావసర వస్తువులు, బట్టలు తడిచిపోయాయని, కనీసం ఇంట్లో ఉండటానికి కూడా వీలు లేకపోవడంతో ఆరు బయట ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో బయ్యారం మండలం అల్లిగూడెం గ్రామానికి సీతక్క వెళ్లగా, స్థానిక రైతు కోడి మల్లేశ్ ఆమె వద్దకు వచ్చి 'రెండు రోజులుగా కురిసిన వర్షానికి వరి పంట కొట్టుకుపోయింది.. నష్టం వచ్చింది.. దండం పెడతా ఆదుకోండి' అంటూ వేడుకున్నాడు. వారం క్రితమే ఐదెకరాల్లో వరి పంట వేశానని, వరదతో తీవ్ర నష్టం వాటిల్లిందంటూ కన్నీరు పెట్టుకున్నాడు. బాధ పడొద్దని రైతుకు ధైర్యం చెప్పిన సీతక్క పంట నష్టాన్ని అంచనా వేయాలని తహసీల్దార్ విజయను ఆదేశించారు.

### అధైర్య పడొద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లొచ్చి, ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క భరోసా కల్పించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, మహబూబాబాద్, గంగారం, బయ్యారం మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆమె స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్యా మురళీనాయక్, కోరం కనకయ్య, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి పర్యటించారు. కేసముద్రం, ఇనుగుర్తి, గంగారం మండల కేంద్రాలు, నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కూలిన ఇళ్లను, తడిసిన నిత్యావసర సరుకులు, తెగిన చెరువులు, వరదలో కొట్టుకపోయిన మూగజీవాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బాధితులతో మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పశువులు, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్, ఆటోలు కొట్టుకుపోయిన వారికి అండగా ఉంటామన్నారు. జిల్లాలో పంట నష్టాన్ని అంచనా వేయాలని, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే తెగిన చెరువులు, రోడ్ల మరమ్మతు చేపట్టాలన్నారు. ఆమె వెంట రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులున్నారు.

### జంపన్నవాగుపై వంతెన నిర్మించాలి

తాడ్వాయి, సెప్టెంబర్ 2 : తాడ్వాయి మండలం ఎల్బాక, పడిగాపురం, నార్లాపురం గ్రామాల మధ్య ఉన్న జంపన్నవాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని సోమవారం గ్రామస్తులు వాగు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏటా వర్షాకాలంలో తమ గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయని, ఏదైనా సమస్య వచ్చినా, ఆరోగ్యం బాగా లేక దవాఖానకు వెళ్లాలన్నా, నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.



తాడ్వాయి : జంపన్నవాగు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు ఉధృతికి ధ్వంసమైన ఎన్‌హెచ్ 365



మహబూబాబాద్ పట్టణ శివారులో మున్నేరువాగు ఉధృతికి నేలవాలిన వరి పంట

# కన్నీరే మిగిలింది..

## వరద తెచ్చిన క(న)ష్టం

*నడవని రైళ్లు.. కదలని బస్సులు*

- వాన తగ్గినా వదలని వరద
- మానుకోట జిల్లాలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం
- భారీగా దెబ్బ తిన్న పంటలు
- కొట్టుకుపోయిన వాహనాలు, మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



నెల్లికుదురు : రావిరాలలో మృతిచెందిన గొర్రె

మహబూబాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : మూడు రోజులు కురిసిన అతి భారీ వర్షాలకు మానుకోట జిల్లాల్లో జన జీవనం అస్తవ్యస్తమైంది. ఇళ్లను, పంటలను ఊడ్చుకెళ్లి నిండా ముంచడంతో ప్రజలకు కన్నీళ్లే మిగిల్చింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం వరకు వాన తగ్గినా.. వరద మాత్రం తగ్గలేదు. వాగుల్లో ఇంకా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. మహబూబాబాద్ నుంచి గూడూరుకు వెళ్లే రోడ్డు మార్గం తప్ప మిగిలిన దారులన్నీ కట్ అయ్యాయి. జిల్లా కేంద్రం నుంచి మరిపెడకు వెళ్లే జాతీయ రహదారి 365 పూర్తిగా దెబ్బతింది. మరిపెడ మండలం పురుషోత్తమాయ గూడెం వద్ద సుమారుగా పది చోట్ల రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో జిల్లాకేంద్రం నుంచి వయా మరిపెడ మీదుగా సూర్యాపేట, ఖమ్మం వెళ్లాల్సిన ప్రజలు ఆగిపోయారు. అలాగే జిల్లాకేంద్రం నుంచి నెల్లికుదురు మీదుగా తొర్రూరుకు వెళ్లాల్సిన మార్గంలో మునిగలవీడు-మదనతుర్తి మధ్య ఉన్న మోరీ వద్ద రోడ్డు వరదకు దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు తప్ప ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు వెళ్లడం లేదు. జిల్లాకేంద్రం నుంచి వయా కురవి, డోర్నకల్ మీదుగా ఖమ్మం వెళ్లాల్సిన రోడ్డు కూడా పూర్తిగా కోతకు గురైంది. డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ఇంటికన్నె వద్ద కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. రైల్వే ట్రాక్ పనుల కోసం 500మంది సిబ్బంది, కార్మికులు పని చేస్తున్నారు. 15మంది అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. రైళ్లు నడిచేందుకు మరో రెండు రోజులు పట్టవచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇటు రైలు మార్గం, అటు రోడ్డు మార్గాలు బంద్ కావడంతో ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం, మరిపెడ మండలం సీతారాం తండాలు భారీ వరదకు నీట మునిగి, ఇళ్లలోకి నీళ్లు పోయి నిత్యాసవరాలన్నీ తడిసి ముద్దయ్యాయి. ఈ రెండు గ్రామాల ప్రజల దీనస్థితి అంతా ఇంతాకాదు. భారీ వరదల కారణంగా జిల్లావ్యాప్తంగా 10 చోట్ల రోడ్లు పూర్తిగా తెగిపోగా, మరో పది చోట్ల రోడ్లు కట్ అయ్యాయని వీటి మరమ్మతులకు కనీసం రూ.2 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. భారీ వరదల కారణంగా 16,810 ఎకరాల్లో వరి పంట, 5,764 ఎకరాల్లో పత్తి, 2,796 ఎకరాల్లో మక్కజొన్న, ఇతర పంటలు 2,172 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇవికాకుండా ఉద్యాన పంటలు, బొప్పాయి, ఇతర కూరగాయలు 675 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లకు మాత్రమే పరిమితమయ్యారు. అంతకుముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రి సీతక్క జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించడంతో కొంత మంది అధికారులు మంత్రి వెంట ఉండిపోయారు. ఇక ప్రజలు ఇబ్బందులు మాత్రం పట్టించుకున్న అధికారులు కరువయ్యారు.



నర్సింహులపేట : ముంగిముడుగు- రామన్నగూడెం మధ్యలో తెగిన రహదారి



సీతారాంతండాలో ఆరబోసిన నిత్యావసరాలు



మూట, ముల్లెతో పురుషోత్తమాయగూడెం రోడ్డు దాటుతున్న ప్రజలు



పురుషోత్తమాయగూడెం వద్ద ధ్వంసమైన ఎన్‌హెచ్365

### బోసిపోయిన రైల్వేస్టేషన్

ఖిలావరంగల్, సెప్టెంబర్ 2: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే వరంగల్ రైల్వే స్టేషన్ సోమవారం బోయిపోయి కనిపించింది. ఇంటికన్నె, కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ కొట్టుకుపోవడంతో ఈ మార్గాన్ని పూర్తిగా మూసి వేశారు. వరంగల్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించడంతో రైల్వేస్టేషన్ వెలవెలబోయింది.



### యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

*పరిశీలించిన జీఎం అరుణ్‌కుమార్ జైన్*

కేసముద్రం, సెప్టెంబర్ 2 : భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లాలో దెబ్బతిన్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వరద ప్రవాహం అధికంగా రావడంతో జిల్లాలోని కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్‌ల మధ్య 418 కిలో మీటర్ రాయి వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ మేరకు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. సుమారు వంద మంది కార్మికులు, ఐదు యంత్రాలు నిరంతరం పని చేస్తున్నాయి. ఈ పనులను ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ పరిశీలించారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. ఐదు ప్రాంతాలలో డ్యామెజీ అయినట్లు గుర్తించి 4 ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.



పనులు పరిశీలిస్తున్న జీఎం జైన్



కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న ట్రాక్ మరమ్మతు పనులు